క్లుప్తంగా

రెండో ఎస్ఎస్ ట్యాంకును నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ నారాయణ

కర్నూలు(సెంట్రల్) : నగరంలో తాగునీటి సమస్య లేకుండా రెండో ఎస్ఎస్ట్యాంకును నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పాతబస్తీలోని ఆ పార్టీ కార్యాలయంలో క్రియాశీలక కార్యకర్తలు, నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరం రోజురోజుకు విస్తరిస్తుండడంతో తాగునీటి సమస్య తలెత్తు తోందన్నారు. అదనపు ఎస్ఎస్ ట్యాంకును నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యుల నియామకం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని ఆయుష్ విభాగంలో ఖాళీ అయిన పోస్టుల స్థానంలో వైద్యులను నియమించారు. ఎమ్మిగనూరులో ఆయుర్వేద వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ స్వర్ణలత, వెల్దుర్తిలో హోమియో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ భారతిని ఇక్కడకు బదిలీ చేశారు. కాగా డాక్టర్ భారతి వెల్దుర్తిలో సోమ, బుధ, శుక్రవారాలు, కర్నూలులో మంగళ, గురు, శనివారాల్లో పనిచేసే విధంగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం వారిద్దరూ బాధ్యతలు తీసుకున్నారు. కాగా ఇక్కడ పనిచేసిన డాక్టర్ ద్వారం ప్రభాకర్రెడ్డి (ఆయుర్వేదం), డాక్టర్ చంద్రశేఖర్రెడ్డి (హోమియో) గత నెల 30వ తేదీన పదవీ విరమణ చెందడంతో ఇక్కడ ఖాళీలు ఏర్పడిన విషయం తెలిసిందే.

పోలీసు గ్రీవెన్స్ రోజంతా నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పోలీసు గ్రీవెన్స్ను రోజంతా నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లాకార్యదర్శి ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సమితి కార్యాలయంలో మా ట్లాడుతూ..ఎంతో మంది బాధితులు జిల్లా నలుమూలల నుంచి పోలీసు గ్రీవెన్స్ కోసం వస్తుంటారన్నారు. అయితే గ్రీవెన్స్ను మధ్యాహ్నం 1.30 గంటల వరకే నిర్వహిస్తుండడంతో వచ్చిన వారు వెనక్కి వెళ్లాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారులు స్పందించి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ను నిర్వహిస్తే బాధితులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

అంటువ్యాధుల నివారణకు చర్యలు

కర్నూలు సిటీ: వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధుల నివారణకు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధికారులకు ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే స్థానిక తన స్వగృహంలో అతిసార నియంత్రణ మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ.తాండ్రపాడు పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డా.విజయ మాధురి, డా.మంజూష పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్మికులతో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఏదైనా గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే వెంటనే అక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈ.తాండ్రపాడు పీహెచ్సీ సిబ్బంది, పాల్గొన్నారు.

సీనియర్ కళాకారుడు ప్రతాప్ గౌడ్ మృతి

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన సీనియర్ కళాకారుడు డి.ప్రతాప్ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం హైదరాబాద్లో కన్నుమూశారు. ఆత్మకూరు సమీపంలోని మద్దూరుకు చెందిన ఈయనకు జిల్లా పౌరాణిక నాటక రంగంతో ఎంతో అనుబంధం ఉంది. టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పదేళ్లపాటు పనిచేశారు. టీజీవీ కళాక్షేత్రం చైర్మన్గా పదేళ్లు పనిచేశారు. నాటక రంగంలో దుర్యోధన పాత్ర వెయ్యిసార్లు ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు.

పెన్షన్..టెన్షన్



బుధవారపేటలో పెన్షన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ పి. రంజిత్బాషా

- పలుచోట్ల ఆలస్యంగా ప్రారంభమైన పెన్షన్
- ఆందోళనతో సచివాలయాలకు చేరుకున్న అవ్వాతాతలు
- పెన్షన్ల పంపిణీలో హడావుడి చేసిన తెలుగు తమ్ముళ్లు
- మొదటి రోజు నగరంలో 93.57 శాతం పెన్షన్ల పంపిణీ

కర్నూలు (టౌన్): గత ఐదేళ్లు ప్రతినెల 1వ తేదీ ఉదయమే ఇంటి వద్ద పింఛన్లు అందుకున్న అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఇప్పుడు అవస్థలు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వం వలంటీర్లను పక్కన పెట్టి సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే, తొలి రోజే పంపిణీలో ఆటంకాలు తలెత్తాయి. పలుచోట్ల సర్వర్లు మొరాయించాయి. దీంతో 11 గంటలు దాటినా ఇంటి వద్దకు పింఛన్ రాకపోవడంతో చాలా మంది ఆందోళన చెందారు. కొత్తపేట, ఎన్ఆర్పేట, పాతబస్తీ తదితర ప్రాంతాల్లో పలువురు సచివాలయాలకు చేరుకొని పింఛన్ కోసం గంటల తరబడి ఎదురుచూశారు. అయితే, పింఛన్ల పంపిణీలో ఎక్కడ చూసినా తెలుగు తమ్ముళ్ల హడావుడి కనిపించింది. బిర్లాగడ్డ ప్రాంతం 63 వ సచివాలయంలో వెంకటస్వామి అనే వృద్ధుడికి టీడీపీ నేత, ఎమ్మెల్సీ బీటీ నాయుడు పింఛన్ అందించారు. అలాగే కె.సరస్వతి అనే మహిళకు నగరపాలక కమిషనర్ భార్గవ్తేజ వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేశారు. కలెక్టర్ రంజిత్బాషా బుధవారపేటలో లబ్ధిదారుల ఇళ్లకెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశారు. డీఆర్డీఏ పీడీ సలీంబాషా, అదనపు పీడీ శ్రీదర్ రావు, టీడీపీ నాయకులు తిక్కారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొదటిరోజు 93.57 శాతం పంపిణీ

నగరపాలక పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ తొలిరోజు 93.57 శాతం పూర్తి చేసినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్తేజ స్పష్టం చేశారు. నగరంలోని 133 సచివాలయాల పరిధిలో 33,751 మంది లబ్ధిదారులు ఉన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 31,581 మందికి రూ. 21,70,98,500 పంపిణీ చేశారు. మంగళవారం నాటికి 100 శాతం పెన్షన్ పూర్తి చేస్తామని కమిషనర్ తెలిపారు.

అధికార పార్టీ కనుసన్నల్లోనే..

కర్నూలు (సిటీ) : కర్నూలు మండల పరిధిలోని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం అధికార పార్టీ కనుసన్నల్లోనే జరిగింది. మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 25 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 10,303 మంది పింఛనుదారులున్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే, సర్వర్ సమస్యతో మధ్యాహ్నం 1 గంట వరకు పింఛన్ల పంపిణీ జరగలేదు. చాలా మంది ఆధార్ కార్డు చేతపట్టుకుని సచివాలయాల చుట్టు తిరిగారు. చాలా గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి పెన్షన్ల పంపిణీ మొదలైంది. అయితే, అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల సమక్షంలోనే ఈ కార్యక్రమం సాగింది. మండలంలో సాయంత్రం 6:30 గంటల వరకు 93 శాతం మందికి పింఛన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.



బిర్లాగడ్డ ప్రాంతంలో వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీడీపీ నాయకులు



గొందిపర్ల గ్రామంలో పింఛన్ల పంపిణీలో అధికార పార్టీ నాయకులు

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు!

కర్నూలు : స్థానిక నరసింహారెడ్డి నగర్లో పింఛన్ల పంపిణీ విషయంలో తెలుగు తమ్ముళ్లు గొడవ పడి ఒకరినొకరు తన్నుకున్నారు. 46వ వార్డులో బూత్ ఇన్చార్జ్లుగా ఆటో ప్రదీప్, నర్సింహులు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మొదటిసారిగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇరువురు పోటీ పడ్డారు. సచివాలయం సిబ్బందితో కలిసి వార్డులో తానే పంపిణీ చేస్తానంటూ ఆటో ప్రదీప్, నర్సింహులు వాదించుకోవడంతో పరిస్థితి అదుపు తప్పి గొడవకు దారితీసింది. దీంతో ఒకరినొకరు కొట్టుకోవడంతో నర్సింహులుకు రక్తగాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో పంచాయతీ స్టేషన్కు చేరింది. ఆటో ప్రదీప్ను రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే కోడుమూరు మండలం అమడగుంట్లలో కూడా పాత టీడీపీ, కొత్త టీడీపీ నాయకుల మధ్య పింఛన్ల పంపిణీ గొడవకు దారి తీసింది. విష్ణువర్ధన్ రెడ్డి వర్గానికి చెందిన గ్రామ సర్పంచు వరలక్ష్మి వర్గీయులు అమడగుంట్ల గ్రామానికి చెందిన మాదన్న వర్గీయుల మధ్య పింఛన్ల పంపిణీ విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. సర్పంచు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు మాదన్న, ఏసుతో పాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 9.30 గంటలకు సంకల్ బాగ్ లోని గీతా ప్రచార ధామంలో సంపూర్ణ భగవ ద్గీత పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు రమణ తెలిపారు. ధార్మిక సంస్థల సభ్యులు, ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మైపర్లో గ్రాడ్యుయేషన్ డే

కర్నూలు సిటీ: జార్జ్ గ్రూపుల సంస్థల కో–ఫౌండర్ దివంగత చెరుకూరి థెరిసమ్మ 88వ జయంతిని పురస్కరించుకుని సోమవారం మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో మూడో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా థెరిసమ్మ, జార్జ్ వి గ్ర హాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబరు ఎం. వెంకట రమణ, ఫోరెన్సిక్ అండ్ టాక్స్ హెచ్ఓడీ, ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.టి సాయి సుధీర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన వారికి అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వైద్యరంగంలో వైద్యుల తరువాత ఫార్మసిస్టులది కీలక పాత్ర అని అన్నారు. తర్వాత ఫా ర్మసీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేసి అభినందనలు తెలిపారు. కా ర్యక్రమంలో మైపర్ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా. స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ డా.జె రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాకర్ల సురేష్, అకడమిక్ డీన్ డాక్టర్ రా జ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కర్నూలు (అగ్రికల్చర్): ఖాతాదారులకు 119 సంవత్సరాలుగా కెనరా బ్యాంకు మెరుగైన సేవలు అందిస్తోందని కర్నూలు రీజనల్ హెడ్ సుశాంత్ కుమార్ తెలిపారు. కెనరా బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని హౌసింగ్ బోర్డు కాలనీ బ్రాంచిలో ఓమినీ హాస్పిటల్ సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఇందు ప్రకాష్రెడ్డి, శిశిర తదితరులు బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులకు వైద్యం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్హెడ్ మాట్లాడుతూ కెనరా బ్యాంకు ఖాతాదారుల అభ్యున్నతే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. అన్ని రకాల రుణాలను తక్కువ వడ్డీ రేటుతో ఇస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్లు వెంకట శంకర్, డిబాసిస్ మహాలిక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన వైద్యులు, కెనరా బ్యాంకు అధికారులు

నాపరాయి లారీకి జరిమానా

కర్నూలు (టౌన్) : రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా నాపరాయిని తరలిస్తున్న లారీని అధికారులు పట్టుకున్నారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మర్రిచెట్ల పాలెం గ్రామం నుంచి హైదరాబాద్లోని పటాన్ చెరువుకు గెలాక్సీ గ్రానైట్ శ్లాబ్ను లారీలో అక్రమంగా రవాణా చేస్తున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గత నెల 22 వ తేదీన జాతీయ రహదారి వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకపోవడంతో ఏపీ 39 వీఈ 3759 లారీని తాలూకా స్టేషన్కు తరలించారు. మైనింగ్, విజిలెన్స్ అధికారులు లెక్క కట్టి రూ.3.20 లక్షలు జరిమానా విధించారు. సోమవారం సంబంధిత వ్యక్తులు ప్రభుత్వానికి జరిమానా చెల్లించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్యం లోపించకూడదు

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుద్ధ్య లోపం కనిపించకూడదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఎంసీహెచ్, ఔషధశాల, ఎఫ్ఎం–4, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో సమన్వయం చేసుకుని శానిటేషన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంసీహెచ్ బ్లాక్ వద్ద నీరు నిలిచి ఉండకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు రూ.10లక్షల అంచనా అవుతుందని ఇంజినీర్లు చెప్పారని తెలిపారు. అండర్గ్రౌండ్ ఆల్టర్నేటివ్ కేబుల్స్కు రూ.80లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఏపీఎస్ పీడీసీఎల్ పవర్ 1000 హౌస్ దగ్గర గతంలో 8 మంది సిబ్బంది పనిచేసే వారని, వీరిని గతంలో తొలగించారన్నారు. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారని, పాతవారికి అదనంగా మరో ముగ్గురు సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

చిన్నపిల్లల విభాగం ఆకస్మిక తనిఖీ

కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగాన్ని సోమవారం సా యంత్రం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి .ప్రభాకర్రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ విభాగంలోని ఎన్ఐసీయూ, పీఐసీయూ, ఎస్ఎన్ సీయూలను పరిశీలించారు. అడ్వాన్స్డ్ పీడి యాట్రిక్ కేర్ యూనిట్లో అత్యాధునిక వైద్య పరికరా లు, పడకలు, ఏసీలపై ఆరా తీశారు. ఎన్ఐసీ యూ లెవెల్–3లో 21 బెడ్లతో ఆధునిక వైద్యసదుపాయాలు ఉన్నట్లు వైద్యులు వివరించారు. అలాగే ఎన్ఐసీయూ లెవెల్–2 వార్డులో 10 బెడ్లతో అత్యాధునిక వైద్య పరికరాలు, ఏసీ సదుపాయం ఉన్నట్లు వారు తెలిపారు. ఎస్ఎన్ సీయూ పది బెడ్లతో అత్యాధునిక వైద్య పరికరాలతో పనిచేస్తోందన్నారు. కంగారూ మదర్ కేర్లో 12 బెడ్లలో మదర్ ఫీడింగ్ బెడ్స్, అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయన్నారు. పాతదైన పీఐసీయూ వార్డును కంగారూ మదర్ కేర్ వార్డులోకి మార్చనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న పీఐసీయూను జనరల్ వార్డుగా ఉంచుతామన్నారు. ఆయన వెంట ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, పీడియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గ్రేస్ అపరంజి తదితరులు ఉన్నారు.

రోగుల నమ్మకాన్ని వమ్ము చేయరాదు

- జాతీయ వైద్యుల దినోత్సవంలో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్లపై రోగులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి వైద్యసేవలు అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్రెడ్డి చెప్పారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయనకు పలువురు వైద్యులు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ధన్వంతరి హాలులో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రికి ఎంతో దూరం నుంచి రోగులు చికిత్స కోసం వస్తారని, వారికి మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. వారు చెల్లించే పన్నులతోనే మనకు జీతాలు వస్తున్నాయన్న విషయాన్ని ఎవ్వరూ మరువకూడదన్నారు. వైద్యులతో పాటు ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, ఏవో శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రిబాయి, అకౌంటెంట్ కుమారస్వామి పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో...

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని కర్నూలు మెడికల్ కాలేజీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మను పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లెక్చర్ గ్యాలరీలో ఉన్న డాక్టర్ బీసీ రాయ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న వైద్యులు

మెడికవర్ హాస్పిటల్లో...

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని మెడికవర్ హాస్పిటల్లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వైద్యుల ప్రాముఖ్యతను వక్తలు కొనియాడారు. అనంతరం వైద్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య కుమార్(కార్డియాలజీ), డాక్టర్ అబ్దుల్ సమద్(యు రాలజీ), డాక్టర్ విశ్వకుమార్(న్యూరోసర్జరీ), డాక్టర్ కిరణ్కుమార్, డాక్టర్ గణేష్కుమార్(ఆర్థోపెడిక్స్), డాక్టర్ సునీల్ యాదవ్(ఎమర్జెన్సీ మెడిసిన్), డాక్టర్ అబ్దుల్ సమద్ (గ్యాస్ట్రో ఎంట్రాలజీ), డాక్టర్ భార్గవ్వ్యాస్ (జనరల్ సర్జరీ), డాక్టర్ సృజన(రుమటాలజీ), డాక్టర్ సరయూరెడ్డి (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ నిహారిక (రేడియాలజీ)లను హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్వరరెడ్డి సన్మానించారు.



మెడికవర్ హాస్పిటల్లో కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

ప్రాణాంతక కోవిడ్ వ్యాధి ప్రబలినప్పుడు ఎంతో త్యాగం, ధైర్యంతో వైద్యులు పనిచేశారని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కొత్తబస్టాండ్ సమీపంలోని అద్య వైద్యశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు డాక్టర్ జయప్రకాష్, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ వి. రమేష్, డాక్టర్ అపర్ణ, జనరల్ సర్జన్ డాక్టర్ ప్రణీత్, డాక్టర్ ప్రత్యూషలను సన్మానించారు.

4న విద్యాసంస్థల బంద్

కర్నూలు(సెంట్రల్): నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ల లీక్ను నిరసిస్తూ జూలై 4వ తేదీన దేశవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ను పాటిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న ప్రకటించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఎస్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, పీడీఎస్యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ మాట్లాడుతూ..వన్ నేషన్–వన్ ఎగ్జామ్ ముసుగులో మోదీ ప్రభుత్వం పోటీ పరీక్షల స్వరూపాన్ని వారికి అనుకూలంగా మలుచుకున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. వెంటనే నీట్, యూజీ నెట్ పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ జూలై 4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్కు పిలుపునిచ్చామని, అందుకు విద్యా సంస్థలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, అబుబకర్, పీడీఎస్యూ నాయకులు దామోదర్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

- నగరపాలక కమిషనర్ భార్గవ్తేజ
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): సమస్యలపై ప్రజలు ఇస్తున్న ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నగరపాలక కమిషనర్ భార్గవ్తేజ అధికారులతో అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని తన చాంబర్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. నగరపాలక కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అభ్యర్థనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ విభాగం ఎస్.ఇ.వేణుగోపాల్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డిప్యూటీ సీటీ ప్లానర్ సంధ్య, రెవెన్యూ అధికారి జునీద్, మేనేజర్ చిన్నరాముడు, టిడ్కో అధికారి పెంచలయ్య, ఏసీపీ శశిలత పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- చెక్పోస్టు సమీపంలోని శ్రీషిర్డీ సాయి కాలనీ, సరస్వతి నగర్లలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, జొహరాపురం రోడ్డు నుంచి తమ కాలనీలోకి మంచినీటి పైపులైన్ను పొడిగించాలని స్థానికులు బి. రమాదేవి, జె. మల్లికార్జున వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.
- రేణుకానగర్, రాధానగర్ కాలనీలలో సరైన రోడ్లు, డ్రైనేజీ కాల్వలు లేవని,అలాగే మున్సిపల్ స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు ఎల్. రత్నా రెడ్డి, శ్రీనివాసులు, గోపాల్ సింగ్ కోరారు.
- రోడ్డు విస్తరణలో తన స్థలం పోయిందని తనకు ఇంత వరకు నష్ట పరిహారం అందలేదని జి. రామక్రిష్ణ అనే వ్యక్తి విన్నవించారు.
- క్రిస్టియన్ శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జొహరాపురం క్రిస్టియన్ చర్చి కమిటీ సభ్యులు కోరారు.
- చిన్న పార్కు వద్ద పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ బాధ్యతలు తమ సామాజిక వర్గానికి ఇవ్వాలని దళిత సఫాయి, కర్మచార సేవా సమితి నాయకులు జి. రమేష్ కోరారు.
- చిత్తారి వీధి జమ్మి చెట్టు వద్ద హంద్రీ నది ఒడ్డున అసంపూర్తిగా ఉన్న ధోబీ ఘాట్ను పూర్తి చేయాలని జిల్లా రజక భవన్ కమిటీ అధ్యక్షుడు రమణ కోరారు.
- విశ్వనాథ్ పార్కును ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అక్కడ అభివృద్ధి చేసి కాపాడాలని స్థానికులు రాంమోహన్ రెడ్డి, భాస్కర్, లక్ష్మీనరసింహ కోరారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్తేజ

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

కర్నూలు(అర్బన్): జీవిత బీమా సంస్థలో పనిభారాన్ని తగ్గించేందుకు, పాలసీ సేవల్ని మరింత సంతృప్తికర స్థాయిలో అందించేందుకు నూతన నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐఐఈఏ ఉద్యోగుల సంఘం కర్నూలు బ్రాంచ్ కార్యదర్శి ఆర్ సునీయకుమార్ కోరారు. సోమవారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) 74వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో అధ్యక్షుడు ఎన్ మక్బూల్ అహమ్మద్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల స్థాయిలో క్రమం తప్పకుండా రిక్రూట్మెంట్ జరుగుతోందని, 3,4 తరగతుల సిబ్బంది నియామకాల్లో నిర్లిప్తత నెలకొనిందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన నియామకాల అవసరముందని ఓ వైపు అంగీకరిస్తూనే, మరోవైపు నియామకాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. 80 శాతం మంది సిబ్బంది సభ్యులున్న తమ యూనియన్కు తక్షణమే అధికారిక గుర్తింపు ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలోనే సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని బ్రాంచ్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ జయమాధురికి అందించారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ అంబుజాసింగ్, జిల్లా నాయకులు రమేష్, అబ్దుల్ఘని, డెవలప్మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, క్లాస్ –1 సంఘం నాయకులు పాల్గొన్నారు.



అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్కు వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఘనంగా కర్నూలు ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ కల్కూర

కర్నూలు సిటీ: కర్నూలు జిల్లా ఆవిర్భావ దిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జిల్లా మేధావుల వ్యవస్థ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో వేడుకలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి. సుబ్రహ్మణ్యం కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కె.చంద్రశేఖర్ కల్కూర ముఖ్య అతిథిగా, కర్నూలు జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రెహమాన్ గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి 57 సంవత్సరాల ముందే కర్నూలులో మూడు గొప్ప తిరుగుబాటు ఉద్యమాలు జరిగాయన్నారు. 1954 సంవత్సరంలో మొదటిసారిగా ప్రవేశ పెట్టిన పద్మ పురస్కారాలను జిల్లా నుంచి విద్యావేత్తగా ఆచార్య లక్ష్మణస్వామి మొదలియార్, రాజనీతి శాస్త్రవేత్తగా ఆర్కాట్ రామస్వామి మొదలియార్, పారిశ్రామిక వేత్తగా మాచాని సోమప్ప అందుకున్నారన్నారు. ఈ అరుదైన గౌరవం కర్నూలు జిల్లాకే దక్కిందన్నారు. 1858 జూలై 1వ తేదీన 8 తాలూకాలతో కర్నూలు జిల్లా అవతరించిందన్నారు. రెండేళ్ల క్రితం జిల్లాల పునర్విభజన చేయడంతో కర్నూలు, నంద్యాల జిల్లాలుగా విభజితమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.బి.ఆర్. ప్రసాద్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ బి.ఎస్. రామయ్య, రచయిత అజీజ్, ఆంగ్ల అధ్యాపకురాలు డా.హెచ్ అక్తర్ భాను, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.